కలప అక్రమ రవాణా చేస్తే చర్యలు

- గుండాలలో కార్డన్ సెర్చ్
- రూ.95వేల కలప పట్టివేత

గుండాలలో కలప స్వాధీనం చేసుకుంటున్న అటవీ శాఖాధికారులు

–ఇచ్చోడ, మార్చి 18 : అడవిని నరికి అక్రమంగా కలప రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కవ్వాల్ టైగర్ రేంజ్ ఇచ్చోడ ఇన్ చార్జి ఎఫ్ఆర్వో గణేశ్ హెచ్చరించారు. సోమవారం గుండాల గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ అక్రమంగా నిల్వ చేసిన కలపను స్వాధీనం చేసుకొని ఇచ్చోడ అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో గణేశ్ మాట్లాడుతూ పక్కా సమాచారంతోనే తనిఖీలు చేశామన్నారు. చెట్లను నరికిన, ఇసుక తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.95 వేల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగిస్తున్న ఇచ్చోడ సీఐ భీమేశ్

ఇచ్చోడ, మార్చి 18 : ఇచ్చోడలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఐ భీమేశ్ అన్నారు. సోమవారం నిర్మల్ బస్‌స్టాప్ వద్ద ఎంపీడీవో లక్ష్మణ్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, ఆర్టీసీ అధికారులతో కలిసి రోడ్డుపై నిలిచి ఉన్న ఆటోలు, రోడ్డుపై నిర్వహిస్తున్న వ్యాపారాలను తొలగించారు. రోడ్డు పక్కన బస్సులు నిలిచేలా, ప్రయాణికులు నిలబడేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేశ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పెన్‌గంగకు నీరు

తాంసి(భీంపూర్), మార్చి 18 : వేసవిలో ఇన్నాళ్లు పెన్‌గంగలో చుక్కనీరు కరువైంది అయితే ఎగువ మహారాష్ట్ర ప్రాజెక్టు నుంచి నీరు వదలడంతో ఇప్పుడు భీంపూర్ మండల సరిహద్దు గుబిడి, గోముత్రి, అంతర్గాం, వడూర్, గొల్లగడ్, తాంసి(కే), పెన్‌గంగ రేవులు జలకళతో కనిపిస్తున్నాయి. ఆ ప్రాంత పశుమందలకు, జీవాలకు తాగునీటికి ఇబ్బంది తప్పింది. అయితే ఏప్రిల్, మేలో గంగలో మళ్లీ నీరు ఉండే అవకాశం లేదు.

అంతర్గాం-మహారాష్ట్ర మధ్య ప్రవహిస్తున్న పెన్‌గంగ

సేంద్రియ ఎరువులతో మేలు

- పంట దిగుబడి అధికం
- ఆసక్తి చూపుతున్న రైతాంగం

గొల్లగడ్ శివారులోని పంట చేనులో ఎరువుల కుప్పలు

భీంపూర్, మార్చి 18 : పంటల దిగుబడుల కోసం మండల రైతులు చేన్లలో పశువుల పెంటకుప్పలు అనే అసలైన సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. వాన కాలం పంటలు తీసిన రైతులు వేసవిలో ఆయా గ్రామాల పశుపోషకుల నుంచి ఆవులు, ఎద్దులు, బర్రెలు సహా జీవాల ఎరువులను ట్రాక్టర్‌కు రూ.2వేల నుంచి 3వేల వరకు ఖర్చు పెట్టుకొని తీసుకువస్తున్నారు. ఈ ఎరువును చేన్లలో కుప్పలుగా పోసిన తర్వాత చేనంతా వెదజల్లుతున్నారు.

రసాయన ఎరువుల కంటే ప్రయోజకం

రైతులు, పశుపోషకులు పాడిపంటల వృద్ధి కోసం ఇటీవల కాలంలో పశువుల మందలను ఎక్కువగా పోషిస్తున్నారు. వ్యవసాయంలో ఎంత ఆధునికత వచ్చినా బహుళ ప్రయోజనాల కోసం పశుసంతతి మనుగడ ఉన్నది. భూసార సంరక్షణకు, ఆరోగ్యవంత పంటలకు రైతులు పశుమందల ఎరువులను వినియోగించడంలో ఆసక్తి చూపిస్తున్నారు. ఇంకొన్ని గ్రామాల రైతులు మహారాష్ట్ర, రాజస్థాన్ ఆవులు, జీవాల మందలను తమ చేన్లలో నెలపాటు ఉండేలా చూసుకొని చేన్లకు సేంద్రియ ఎరువులు సమకూర్చుకుంటున్నారు.

పశుపేడతో మంచి పంటలు

తరాల నుంచి రైతు తన సొంత ఎద్దులు, ఆవులు, బర్రెల పేడను పెంటకుప్పలుగా వాడుతున్నాడు . పెద్ద రైతులు వేరే ప్రాంతాల నుంచి కూడా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో సేంద్రియ ఎరువును కొనుగోలు చేస్తున్నారు. వాటిని చేనంతా వెదజల్లుతున్నారు. వీటితో వర్షాలకు ఎరువంతా భూమిలో ఇంకి తర్వాత మొక్కలకు మంచి ఔషధంగా పని చేస్తున్నది. తద్వారా జొన్న, కంది తదితర ఆహార దినుసు పంటలు ఆరోగ్యవంతంగా పండుతున్నాయి. అలాగే పత్తి లాంటి వాణిజ్య పంటల దిగుబడి పెరుగుతుంది. మేము ప్రతి ఏటా సేంద్రియ ఎరువుల వాడకం చేస్తాం.

- ఈరోల్ల గంగాధర్, రైతు ,ఈదుల్లాసావర్గాం

క్రమశిక్షణతో ఆడి ప్రతిభ ప్రదర్శించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్/ఉట్నూర్, మార్చి 18: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టులో పాల్గొంటున్న క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి ప్రతిభను ప్రదర్శించి కప్‌ను సాధించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి సూచించారు. ఢిల్లీలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లో సోమవారం ప్రారంభమైన శిక్షణ శిబిరానికి ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఖోఖో, కబడ్డీ క్రీడలు ఎక్కువగా ఆడుతారని తెలిపారు. 1980 జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తాము సైతం ఉత్సాహంగా గ్రౌండ్‌ను సిద్ధం చేశామని గుర్తు చేశారు. ఇన్ఫ్రస్ట్రక్చర్ ఉన్న లేకున్నా క్రమశిక్షణతో ఆడి ప్రతిభను కనబరచాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏఎస్ఓ హేత్, కోచ్ శివకృష్ణ, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

నిర్మల్ టౌన్, మార్చి18: పట్టణంలోని మంజులాపూర్ ఆశ్రమం లో సోమవారం లయన్స్‌క్లబ్ సభ్యులు పరమేశ్వర్ కుమారుడు మాళీనాథ్ జయంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు అ న్నదానం చేశారు. ఆశ్రమంలో ఉన్న వారికి పాలు, పండ్లు, ఆహారం అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు పురుషోత్తమ్ రె డ్డి, చంద్రమోహన్, లక్ష్మీనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

దొంగచాటున అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

జైనథ్, మార్చి 18: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలు, రైతులకు ఆరు గ్యారెంటీల ఆశ చూపి దొంగచాటున అధికారంలోకి వచ్చిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ విమర్శించారు. సోమవారం బెల్లూరి గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులతో పాటు యువకులు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు, ఎకరాకు రూ.15 వేలు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కట్కం రాందాస్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి జ్యోతిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రమేశ్, ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

నార్నూర్, మార్చి 18 : మండలంలోని నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఈజీఎస్ ఏపీవో జాదవ్ సురేశ్ సిబ్బందికి సూచించారు. తాడిహత్నూర్, జామడ, గుంజాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ పదో విడత లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు కృషి చేయాలని, చిగురించిన మొక్కలు ఎండిపోకుండా రోజు నీరు పట్టాలని సూచించారు. అలాగే ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఆయన వెంట టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

తాడిహత్నూర్‌లోని నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఏపీవో

వృద్ధులు, దివ్యాంగులకు ఓటుపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ తుకారాం

ఇచ్చోడ, మార్చి 18 : కేంద్ర ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులకు కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తుకారాం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని వృద్ధుడి ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆర్ఐ హుస్సేన్, సామాజిక కార్యకర్త అబ్దుల్ సాబీర్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యపై వినతి

వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18 : మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం సంవత్సరానికి 15 క్యాజువల్ సెలవులు ఆదిలాబాద్ మున్సిపల్‌లో అమలు కావడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ చిరంజీవి, సిర్ర దేవేందర్ ఉన్నారు.

సోనాలలో భారీ వర్షం

సోనాలలో కురుస్తున్న వర్షం

బోథ్, మార్చి 18 : సోనాలలో సోమవారం భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షంతో యాసంగి కింద సాగు చేస్తున్న పంటలకు నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న జొన్న, విత్తనోత్పత్తి జొన్న, మక్క, నువ్వు పంటలకు వర్షం చేటు చేసింది.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

తాంసి, మార్చి 18 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడేలా సిబ్బంది ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంఈవో నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు కప్పర్లలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే తాంసి, కప్పర్ల పరీక్షా కేంద్రాలను ఎంపీడీవో మోహన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విష్ణు జాదవ్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష రాసే విద్యార్థులను మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్లు ఆనంద్‌రావ్, శ్రీధర్‌రెడ్డికి ఆదేశించారు.

టీకాతోనే పశువులకు రక్షణ

ఇచ్చోడ: పశువులకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18: పశువుల్లో వైరస్ వల్ల వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు టీకాలను వేయించాలని పశు వైద్యాధికారి రాథోడ్ దూద్‌రాం అన్నారు. మావలలో సోమవారం సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, కారోబార్ దశరథ్, పశు వైద్య సిబ్బంది సాయిప్రసాద్, రమేశ్, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, మార్చి 18 : మండలంలోని సాత్ నంబర్, ఇస్లాంనగర్‌లో పశు వైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల ఖాతాలో డబ్బులు జమ చేసే వరకూ పోరాటం

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18 : ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం కలిశారు. రెండు నెలల పెండింగ్ వేతనాలు, ఈఎస్ఐ పేరుతో కట్ చేసిన రూ.కోటి 60 లక్షలు కార్మికులకు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. ఈ విషయాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నేతలు పేర్కొన్నారు. ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేసేంత వరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కలెక్టర్ రాజర్షి షా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ(పోషణ పక్షం) కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం పోషణ పక్షం కార్యక్రమంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిరుధాన్యాల ఉపయోగం, ప్రాధాన్యతను ఈ నెల 23 వరకు గ్రామస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. బుధవారం విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రిషన్ డే సందర్భంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటకాల ప్రదర్శన, రక్తహీనత అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించాలని, దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

నార్నూర్, మార్చి 18 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మెస్రం సందీప్ ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 8గంటల ప్రాంతంలో సందీప్ గుట్కా తినడానిన గమనించిన ఉపాధ్యాయుడు జాదవ్ ఇందల్ కర్రతో చితకబాదాడు. తోడలపై తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సోమవారం పాఠశాలకు చేరుకున్నారు. సందీప్‌ను ఎందుకు కొట్టారని ఉపాధ్యాయుడిని నిలదీశారు. గుట్కా తినడంతో కొట్టానని సమాధానం ఇచ్చాడు. సందీప్ అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి కూడా తీసుకెళ్లలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, చికిత్స నిమిత్తం ఉట్నూర్‌కు తీసుకెళ్లారు. ఐటీడీఏ పీవోకు కూడా ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పిప్పర్‌వాడ పాఠశాలలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శృతి

జైనథ్, మార్చి 18: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శృతి అన్నారు. సోమవారం పిప్పర్‌వాడ గ్రామంలోని పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పిల్లలచే ర్యాలీ తీసి, ప్రతిజ్ఞ చేయించారు. మహిళ సాధికారత, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయలన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం వర్కర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు వసంత, లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉట్నూర్ రూరల్, మార్చి 18 : లక్కారం గ్రామంలోని నేతకాని వీధిలో సోమవారం పోచమ్మ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మేడి ఆశన్న, బండి గంగన్న, మల్లయ్య, రాజన్న, మహేందర్, నర్సయ్య, గంగేశ్వర్, మల్లేశ్, ఆశన్న, భూమన్న పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

అకాడమీ ప్రవేశానికి బయలేదరిన విద్యార్థులు

హైదరాబాద్‌కు వెళ్తున్న జిల్లా విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18: రాష్ట్ర స్థాయి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి తుది ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌కు బయలేదరి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏసీఎంవో జగన్, జిల్లా గిరిజన క్రీడాల అధికారి పార్థసారిథి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ప్రతిష్టాత్మకంగా వాటర్ స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసిందన్నారు. అనాతీకాలంలోనే గిరిజన విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా తీర్చుదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ హేమంత్ కుమార్, కోచ్‌లు శివకృష్ణ, కార్తీకుమార్, అర్క నాని పాల్గొన్నారు.

టీఎస్ఎఫ్ లోగో ఆవిష్కరణ

టీఎస్ఎఫ్ లోగో ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18 : ఆదిలాబాద్‌లో యాదవ సంఘం భవనంలో టీఎస్ఎఫ్ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు, శాస్త్ర విద్యా విధానం అమలు చేయాలని, కామన్ స్కూల్ విద్యా విధానం కోసం కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ స్టూడెంట్ ఫోరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొడం గణేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఐఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీర వినోద్ నాయక్, ఏఐఎస్బీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
ఉచిత శిక్షణ-ఉపాధి
jobs Apply Now!
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677